క్లుప్తంగా

7న హైదరాబాద్‌లో సదస్సు



మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందు: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కె.సారంగపాణి కోరారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో 32 వేల మంది కార్మికులకు కనీస వేతనాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

యూరియా కోసం నేడు ఆందోళన

ఇల్లెందు: రైతులకు సరిపడా ఎరువుల సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపులో భాగంగా సోమవారం ఇల్లెందులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శీలం రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహం నుంచి గోవింద్ సెంటర్ వరకు ర్యాలీ, ఏఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

పీడీఎస్‌యూ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

టేకులపల్లి: పీడీఎస్‌యూ టేకులపల్లి మండల నూతన కమిటీని శనివారం జరిగిన 23వ మండల మహాసభలో ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కార్యదర్శి జే.గణేష్ నూతన కమిటీ వివరాలను వెల్లడించారు. కమిటీ అధ్యక్షురాలు జి.రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలు బి.ఉష, ప్రధాన కార్యదర్శి ఎ.లోకేష్, సహాయ కార్యదర్శి ఉపేందర్, కోశాధికారి బి.దీపిక సభ్యులు సాయికిరణ్, వి.తిలక్, దిలీప్, అజయ్లను ఎన్నుకున్నట్లు గణేష్ తెలిపారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

జూలూరుపాడు: జూలూరుపాడు హైస్కూల్‌లో రెండు రోజులు జరగనున్న మండల స్థాయి క్రీడా పోటీలు సోమవారం ప్రారంభం కానున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సుధాకర్‌రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నల్గొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం శేషగిరిభవన్‌లో ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి విజయలక్ష్మి, కోడెల మంగ, భూక్యా క్రాంతి, సుగుణ, స్వప్న, రమాదేవి, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా 11 కేవీ విద్యుత్ స్తంభం



తావుర్యా తండా సమీపంలో విద్యుత్ స్తంభం

టేకులపల్లి: 11 కేవీ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉండటంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. టేకులపల్లి మండలం కొత్తతండా(పి) నుంచి తావుర్యాతండా వెళ్లే మార్గంతో గంగముత్యాలమ్మ వద్ద బ్రిడ్జి దాటిన తరువాత మూలమలుపు వద్ద స్తంభం ఒరిగి ప్రమాదకరంగా ఉంది. ఏ క్షణమైనా పడిపోయేలా ఉంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఏ ప్రమాదం జరగక ముందే స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

రీటెండర్ దశలో అసంపూర్తి నిర్మాణాలు!

- నాలుగు పనులకు రూ.1.89 కోట్లు
- ఇల్లెందు మున్సిపాలిటీలో కుంటుపడిన అభివృద్ధి



అసంపూర్తిగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనం

ఇల్లెందు: మున్సిపాలిటీ పాలకవర్గం కాలం 8 నెలల క్రితం ముగిసింది. ఈ కాలంలో మున్సిపాలిటీలో పైసా అభివృద్ధి పనుల జరగలేదు. ఇక రెండేళ్లుగా కీలక అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉంటున్నాయి. అదనపు నిధులున్నా.. రీ టెండర్ దశలో రోజులు గడడిచిపోతున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మల్టీ యుటిలీటీ సెంటర్, స్విమ్మింగ్ పూల్ రక్షణ పనులు, మోడల్ మార్కెట్‌లో ఓపెన్ షెడ్ నిర్మాణం ఇలా నాలుగు పనులకు రూ.1.89 కోట్ల టెండర్ జరగాల్సి ఉంది..

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్..

పలురంగాల్లో స్థిరపడాలనుకునే నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ధ్రువపత్రం అందజేసి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి కోర్సుల నిలయం (స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్) నిధులు రీటెండర్‌తోనే కాలం గడిచిపోతుంది. ట్రైనింగ్ ప్రొవైడర్ అంటే సెకండ్ పార్టీ ద్వారా వివిధ ట్రేడ్‌లలో శిక్షణ నిర్వహించడానికి అనువైన ప్రాంగణంగా ఈ సెంటర్ ఉపయోగపడనుంది.ఇందులో 8 తరగతి గదులు, ఆఫీస్ రూం, ప్రిన్సిపాల్ గది, స్త్రీ, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్లు, ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాలు, పరికరాలు, సంబంధిత సౌకర్యాలు కల్పించేందుకు రూ.1.50 కోట్లతో చేపట్టగా అసంపూర్తిగా నిలిచిపోయింది. మరో రూ.90 లక్షలు కేటాయించారు. కానీ రీ టెండర్ దశలో పనులు ముందుకు సాగటం లేదు.

అదే స్థితిలో మల్టీ యుటిలిటీ సెంటర్..

పట్టణ నడిబొడ్డున బుగ్గవాడు – రైల్వే అండర్ బ్రిడ్జి మధ్యలో మెయిన్ రోడ్ పక్కన పాత సింగరేణి క్వార్టర్స్ ఏరియాలో మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన మల్టీ యుటిలిటీ సెంటర్ నిర్మాణం కూడా మళ్లీ రీ టెండర్ దశలోనే ఉంది. 30 గుంటల స్థలంలో రూ.1.30 కోట్లతో భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. స్లాబ్ వరకు పూర్తయింది. విద్యుత్, మరుగుదొడ్లు, స్నానపు గదులు, ప్రహరీ, లైటింగ్, సంప్, మోటార్లు బిగించాల్సి ఉంది. నిధులు సరిపోలేదు, అసంపూర్తిగా వదిలేశారు. మరో రూ.80 లక్షలు నిధులు కేటాయించినా రీ టెండర్ దశలోనే ఉంది. మల్టీ యుటిలిటీ సెంటర్ నిర్మాణం పూర్తయితే సభలు, సమావేశాలు పెళ్లిళ్లు, శుభ కార్యాలకు ఉపయోగంగా ఉంటుంది.

మూతపడిన స్విమ్మింగ్ పూల్..

రెండు నెలలుగా ఈత కొలను ఎండబెట్టారు. లేక్ వ్యూ పార్క్ పడావు పడింది. పారిశుద్ధ్యంపై పట్టింపు లేదు. పార్క్‌లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఆటవస్తువులకు మెయింటెనెన్స్ లేదు. లేక్ వ్యూ పార్క్ కళాహీనంగా మారింది. ఈ పార్క్‌లో రూ.కోటితో నిర్మించిన ఈత కొలను మూలన పడేశారు. రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని పట్టణవాసులు విమర్శిస్తున్నారు. ఈత కొలను చుట్టూ రక్షణకు ఫెన్సింగ్‌కు రూ.8.50 లక్షలు నిధులు కేటాయించారు. ఈ పనులు కూడా టెండర్ దశలోనే ఉన్నాయి.

మోడల్ మార్కెట్‌లో ఓపెన్ షెడ్లు..

పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో ఆం బజార్ వైపు ఖాళీ స్థలంలో ఆకుకూరలు, కోతిమీర, పుదీన విక్రయదారుల కోసం ఓపెన్ షెడ్లు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఇందుకు రూ.8.50 లక్షలు నిధులు కేటాయించారు. ఈ నిధులలో ఓపెన్ షెడ్ల ముందు ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలని నిధులు కేటాయించినా టెండర్ దశలోనే ఆగిపోయింది.



నిలిచిపోయిన మల్టీ యుటిలిటీ సెంటర్ నిర్మాణం

త్వరలో టెండర్ పూర్తవుతుంది..



నిధులు ఉన్నాయి, టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అతి త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాము. ప్రజా అవసరాల కోసం అన్ని పనులు పూర్తి చేయిస్తాం. కొన్ని చిన్న చిన్న ఆటంకాల వలన కొన్ని పనులు నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేయిస్తాం.

– కె.మురళీ, డీఈఈ, మున్సిపల్, ఇల్లెందు

కార్మికులపై వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న సుల్తానా

ఇల్లెందు: మధ్యాహ్న భోజన కార్మికులపై ప్రభుత్వం వేధింపులు ఆపాలని సీఐటీయూ కోరింది. ఆదివారం సీపీఎం కార్యాలయంలో జరిగిన సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభలో నాయకురాలు సుల్తానా, సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.నబీ, టి.కృష్ణ మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా విజిటేబుల్ బిర్యానీ, రెండు కూరలు వండి పెట్టాలని ఒత్తిడి చేస్తోందన్నారు. నెలల తరబడి బిల్లులు ఇవ్వకపోతే వంటలు ఎలా వండుతారని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన కార్మికుల కష్టాలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఈ మహాసభలో కుమారి, జయ, ఐలమ్మ, యాదమ్మ, రాములమ్మ, ఖైరూన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా వెంకటాచారి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా కార్పొరేట్ ఎస్టేట్స్‌లో ఏజీఎంగా విధులు నిర్వహిస్తున్న వెంకటాచారిని నియమిస్తూ శనివారం రాత్రి ఈఈ సెల్ హెచ్‌ఓడీ ఏజే మురళీధర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. అంతకంటే ముందు సెక్రటరీగా పనిచేసిన గుండా శ్రీనివాస్ అప్మెయిల్‌కు బదిలీ కావటంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జ్‌గా మురళీధర్‌రావును కంపెనీ నియమించింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జూలూరుపాడు: వెంగన్నపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. గాంధీనగర్ గ్రామపంచాయతీ గంగారంతండాకు చెందిన ధరావత్ రాంబాబు బైక్‌పై జూలూరుపాడు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెంగన్నపాలెం గ్రామంలో గుండెపుడి నుంచి జూలూరుపాడు వెళ్తున్న బొలెరో వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. రాంబాబుకు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, కానిస్టేబుళ్లతో సంఘటనా స్థలాన్ని వచ్చి, స్థానికుల సాయంతో రాంబాబును కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. బొలేరో వాహనం గుండెపుడి గ్రామానికి చెందిన సూర్యదని తెలిసింది.

2న సింగరేణి కార్యాలయం ఎదట ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల వలన కార్మికుల సమస్యలు పెరిగిపోతున్నాయని, వాటి సమస్యల సాధనకు ఈనెల 29 నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనుందని టీబీజీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి కాపు కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న సింగరేణి వ్యాప్తంగా ఉన్న జీఎం కార్యాలయాల్లో సమస్యలపై వినతిపత్రాలు అందజేసి, సెప్టెంబర్ 2న సింగరేణి ప్రధాన కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి యూనియన్ అగ్రనాయకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను వివరించారు.

- కొత్త ట్రాన్స్‌ఫర్ పాలసీని రద్దు చేయాలి.
- వాస్తవ లాభాలపై కార్మికులకు 35శాతం వాటా చెల్లించాలి.
- కార్మికులకు ఆదాయపు పన్ను రద్దు చేయాలి. అలవెన్స్‌లపై ఆదాయపు పన్నును యాజమాన్యమే కోలిండియా మాదిరిగా చెల్లించాలి.
- అనారోగ్య సమస్యలపై మెడికల్ బోర్డ్‌కు వెళ్తున్న కార్మికులందరినీ అన్‌ఫిట్ చేయాలని, 24 ఏళ్ల కాలపరిమితిని 36 నెలలకు పెంచాలి.
- జూలైలో మెడికల్ బోర్డును తిరిగి నియమించి వారందరినీ అన్‌ఫిట్ చేయాలి.
- వేలంపాటతో సంబంధం లేకుండా సింగరేణికి నూతన గనులు కేటాయించాలి.
- మెడికల్ ట్రైనింగ్ పూర్తయిన డిపెండెంట్లకు నియామక పత్రాలు అందజేయాలి.

ధ్వంసమైన కాజ్‌వే నిర్మాణ పనులు



కిన్నెరసాని వాగుపై దెబ్బతిన్న చప్టా

పాల్వంచరూరల్: కిన్నెరసాని గేట్లు ఎత్తడంతో వరద ప్రవాహానికి వాగులో నిర్మాణం చేస్తున్న కాజ్‌వే(చప్టా) కోతకు గురై ధ్వంసమైంది. పుల్లాయిగూడెం నుంచి రెడ్డిగూడెం గ్రామం వరకు జెన్కో సీఎస్‌ఆర్ పాలసీ కింద రూ.1.70 కోట్ల వ్యయంతో గతేడాది మంజూరైన నిధుల ద్వారా కిన్నెరసాని వాగులో కాజ్‌వే (చప్టా), బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పంచాయతీరాజ్‌శాఖ అధికారుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కిన్నెరసాని గేట్లు ఎత్తినప్పుడు వరద ప్రవాహానికి నిర్మాణంలో ఉన్న చప్టా పనులు ధ్వంసం కాగా, రహదారి కోతకు గురైంది.

పునర్నిర్మాణానికి చర్యలు..

పుల్లాయిగూడెం నుంచి రెడ్డిగూడెం వరకు చేపట్టిన రహదారి, చప్టా పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. వరద కారణంగా దెబ్బతిన్న చప్టా, కోతకు గురైన రహదారి పనులను కాంట్రాక్టర్‌తో పునర్నిర్మాణం చేయిస్తాం. – శివలాల్, పీఆర్ ఏఈ

గౌడ సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు



వనభోజన కార్యక్రమంలో సంఘం సభ్యులు

టేకులపల్లి: టేకులపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాస వనభోజనాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు ఇంటిల్లిపాది తరలివచ్చి బొజ్జాయిగూడెం సమ్మక్క సారక్క గద్దెల దగ్గరలోని వనంలో నాయకులు చిర్రా వెంకటయ్య, గాడిపెల్లి రాములు ఆధ్వర్యంలో ప్రకృతితో అనుబంధాన్ని పంచుకున్నారు. సభ్యులు ఐక్యత, స్నేహభావంతో కలిసి చెట్ల నీడన వన భోజనాలు చేసి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, వెంకన్న, పలువురు గౌడ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లవుతుందని ఆరో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక కేఎస్పీ రోడ్డులోని ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం పాల్వంచ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ హాజరై రక్తదానం చేశారు. అనంతరం రాజయోగిని బ్రహ్మకుమారి ప్రకాశ్ మనిదాదీజీ 18వ పుణ్యతిథి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ రక్తాదనం చేయడం వలన రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి ఉపయోగపడుతుందన్నారు. ఈ శిబిరంలో సేకరించిన 90 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు పంపిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం రక్తదాతలకు బహుమతులు అందజేశారు.

యూరియా కొరతను నివారించాలి

జూలూరుపాడు: యూరియా కొరత తక్షణమే నివారించాలని బీఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జూలూరుపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఏ రోజూ రైతులు యూరియా కోసం ఇబ్బంది పడలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు యూరియా కోసం రోడ్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడటంతోపాటు, క్యూలైన్‌లో చెప్పులు పెట్టి పడిగాపులు కాయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఒకవైపు రైతులు యూరియా కోసం, మరోవైపు విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రోడ్లెక్కి ధర్నాలు చేస్తుంటే సీఎం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అని డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, లేదంటే రైతులు, విద్యార్థులచే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చాపలమడుగు రామ్మూర్తి, లకావత్ హేమ్లా, భూక్యా సేవా, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్ గౌరవాధ్యక్షురాలిగా కవిత?



కల్వకుంట్ల కవిత

సింగరేణి(కొత్తగూడెం): హిందూ మజ్దూర్ సభ (హెచ్‌ఎంఎస్) గౌరవాధ్యక్షురాలిగా కల్వకుంట్ల కవితను నియమించనున్నట్లు సమాచారం. ఈనెల 31న మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో జరగనున్న యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా నేతలు ఎన్నుకోనున్నట్లు తెలిసింది. ఇటీవల తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గౌరవాధ్యక్షురాలిగా కవితను తప్పించి కొప్పుల ఈశ్వర్‌ను నియమించిన సంగతి విదితమే. ఈ మేరకు కవిత తటస్థంగా ఉంటుందా.. ఇతర యూనియన్‌లోకి వెళ్తుందా అనే అంశం కొన్నిరోజులుగా గులాయిల్లో కార్మికులు గుసగుసలాడుకుంటున్న తరుణంలో కవిత తాజాగా హిందూ మజ్దూర్ సభ గౌరవాధ్యక్షురాలిగా నియమించనున్నట్లు వార్త వెలుగులోకి వచ్చింది. ఈ విషయంలో ఇటీవల హైదరాబాద్‌లోని కవిత నివాసంలో సింగరేణి జాగృతి హెచ్‌ఎంఎస్ నాయకులు కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1982- 83 బ్యాచ్ పదో తరగతి విద్యార్థినులు

ఇల్లెందు: పూర్వవిద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఉపాధ్యాయుల బోధ, పాఠశాలలలో జరిగిన అల్లర్లు, పోటీ పడి చదువులో రాణించిన తీరు గుర్తు చేసుకున్నారు. రోజంతా పూర్వకాలం నాటి మధుర క్షణాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. పట్టణంలోని గోవింద్ సెంటర్‌లోని జిల్లా పరిషత్ గరల్స్ హైస్కూల్ 1982–83 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం గెట్ టూ గెదర్ నిర్వహించారు. ఆనాటి ఉపాధ్యాయును సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు బి.రమణకుమారి, వి.భద్రమ్మ, సరళ లహోటీ, కె.నాగమణి, సుధారాణి పాల్గొన్నారు.

కాలేజీల మంజూరుపై హర్షం

కొత్తగూడెంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధి పాల్వంచ నవభారత్‌లోని మైనారిటీ గురుకుల కళాశాలలో బాలుర కొరకు, ఖమ్మంలోని రాపర్తినగర్‌లోని బాలికల కళాశాలలో బాలికలకు ఈ విద్యా సంవత్సరం నుంచి సీఓఈ కళాశాలలను మంజూరు చేయడంపై మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ.యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా మైనారిటీ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో నీట్, జేఈఈ మెయిన్స్ పరీక్షలలో శిక్షణ అందించి వారిని డాక్టర్లు, ఇంజనీర్లుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో మైనారిటీ గురుకుల కార్యదర్శి బి.షఫీఉల్లా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరం నుంచి 15 సీఓఈ కళాశాలలు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని తెలిపారు.

కళాశాలలో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 26 లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, అదేవిధంగా ఈనెల 29న నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని సూచించారు. మైనారిటీ వర్గాలకు చెందిన ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధ, పార్సీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- మండలంలో 620 మంజూరు
- పైలట్ ప్రాజెక్టుగా కోమటిపల్లిలో 99





కోమటిపల్లిలో బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు, స్లాబ్ లెవల్‌లో...

సుజాతనగర్: రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మండలంలో జోరుగా సాగుతున్నాయి. మొత్తం 20 గ్రామ పంచాయతీల పరిధిలో 620 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను రెండు నెలల క్రితం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నిర్మాణ పనులు కూడా ప్రారంభింపజేశారు. మండల, గ్రామ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ఆయా ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్నారు.

పైలట్ ప్రాజెక్టుగా కోమటిపల్లి..

మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కోమటిపల్లి గ్రామం పూర్తిగా గిరిజన గ్రామం. జనాభా వెయ్యి కంటే తక్కువే. చిన్న గ్రామం కావడంతో అధికారులు ఈ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి 99 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలను ప్రారంభించారు. లబ్ధిదారులు ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలని అధికారులు అవగాహన కల్పించారు. సుమారు 43 ఇళ్లకు బిల్లులు కూడా అందాయి. వర్షాకాలం కావడంతో కొంతమంది ఇంకా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించ లేదు. ప్రారంభించని లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను చేపట్టేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అధికారులు పర్యవేక్షిస్తూ అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. నిబంధనలకు లోబడి నిర్మాణం జరుగుతున్న ఇళ్లకు సంబంధించిన బిల్లులు కూడా జమ చేశారు.

అధికారుల ప్రోత్సాహం...

కొన్ని ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ మరికొంత మంది మాత్రం వివిధ కారణాలతో పనులు ప్రారంభించ లేదు. సంబంధిత అధికారులు అలాంటి వారితో మాట్లాడి ఇళ్లు నిర్మించుకునేలా ఒప్పిస్తున్నారు. దీంతో పాటు ఆర్థికంగా లేని వారికి మహిళా సంఘాల నుంచి రూ.లక్ష వడ్డీ లేని రుణం తీసుకోవచ్చని కూడా సూచిస్తున్నారు.

కల నెరవేరింది...



సొంతిల్లు కట్టుకోవాలని ఎన్నో కలలు గన్నాం. నేడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మాకు ఇల్లు మంజూరు కావడంతో మా కల నెరవేరింది. ఇంటి నిర్మాణం ప్రారంభించాం. స్లాబ్ లెవల్ వరకు పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వ సాయంతో ఇల్లు నిర్మించుకుంటున్నాం. – లావుద్యా లక్ష్మి, కోమటిపల్లి

ఆనందంగా ఉంది...



సొంతిల్లు నిర్మించుకోవాలని ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మా కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం ఆనందంగా ఉంది. కుటుంబం అంతా సంతోషంగా పనుల్లో పాల్గొంటున్నాం. వీలైనంత త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొంటాం.

– బానోత్ లక్ష్మి, కోమటిపల్లి

లబ్ధిదారులతో మాట్లాడుతున్నాం..



మండల వ్యాప్తంగా మంజూరైన ఇళ్లలో కొన్నింటికి నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఆ లబ్ధిదారులను కలిసి మాట్లాడుతున్నాం. కారణాలు తెలుసుకుని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. వందశాతం ఇళ్లు పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నాం.

– బి.భారతి, ఎంపీడీఓ, సుజాతనగర్